నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, బుధవారం 27 నవంబర్ 2024 | HYDERABAD

నగరంలో ఏ ఇంట్లో చూసినా జలుబు, దగ్గు, జ్వరంతో బాధపడుతున్నారు. దీంతో ప్రభుత్వ దవాఖానలకు ప్రజలు క్యూ కడుతున్నారు. మంగళ వారం పీవర్ హాస్పిటల్‌లో ఓపీ వద్ద బారులు తీరిన దృశ్యం.

సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి మహమూద్ అలీ, చిత్రంలో ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, కార్తీక్ రెడ్డి తదితరులు

దీక్షాదివస్ సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, చిత్రంలో ఎమ్మెల్యేలు తలసాని శ్రీనివాస్ యాదవ్, పద్మారావు గౌడ్, కాలేరు వెంకటేశ్, ముఠా గోపాల్, మాగంటి గోపీనాథ్, మండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పాన్నాల లక్ష్మయ్య, మాజీ చైర్మన్లు గజ్జెల నగేశ్, ఎర్రోళ్ల శ్రీనివాస్, విప్లవ్, బీఆర్ఎస్ నేతలు నివేదిత సాయన్న, తలసాని సాయికిరణ్ తదితరులు

హైదరాబాద్‌ను ముక్కలు చేసే కుట్ర!

నగర ఇమేజ్‌ను డ్యామేజ్ చేయడంలో బీజేపీ భాగం ఉంది

బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

దీక్షా దివస్‌ను విజయవంతం చేయాలని శ్రేణులకు దిశానిర్దేశం

ఈ నెల 29న 10వేల మందితో తెలంగాణ భవన్‌కు దీక్షా దివస్ భారీ ర్యాలీ

ఒక్కో నియోజకవర్గం నుంచి రెండు వేల వరకు శ్రేణులు పాల్గొనేలా ప్లాన్

నిమ్స్‌లో 2వేల మందికి పండ్ల పంపిణీ

హైదరాబాద్ జిల్లా స్థాయి బీఆర్ఎస్ సమావేశంలో నిర్ణయాలు

కాంగ్రెస్ ప్రభుత్వంలో ఏ వర్గం సంతోషంగా లేదు

సిటీబ్యూరో, నవంబర్ 26 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ఉద్యమాన్ని మలుపు తిప్పిన చారిత్రక ఘట్టం కేసీఆర్ దీక్ష అని, ఈ నెల 29న నగరవ్యాప్తంగా దీక్షా దివస్‌ను అంగరంగ వైభవంగా నిర్వహించాలని హైదరాబాద్ జిల్లా స్థాయి సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ నిర్ణయించింది. ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అధ్యక్షతన తెలంగాణ భవన్‌లో మంగళవారం హైదరాబాద్, సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి బీఆర్ఎస్ సమావేశం జరిగింది. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా పాల్గొని నేతలకు, శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఏ వర్గం కూడా సంతోషంగా లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలని పార్టీ శ్రేణులకు కేటీఆర్ పిలుపునిచ్చారు. ఓఆర్ఆర్ లోపల ఉన్న హైదరాబాద్‌ను మూడు లేదా నాలుగు ముక్కలు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి కుట్ర చేస్తున్నాడని కేటీఆర్ ఆరోపించారు. హైదరాబాద్ ఇమేజ్‌ను డ్యామేజ్ చేసే కుట్రలో బీజేపీకి కూడా భాగం ఉందని విమర్శించారు. నిత్యం జనంలో ఉండి ప్రజల కష్టాల్లో తోడు ఉండే వారందరికీ అవకాశాలు లభిస్తాయని కేటీఆర్ చెప్పారు. దీక్షా దివస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు కేటీఆర్ పిలుపునిచ్చారు. కాగా ఈ నెల 29న ఉదయం 9 గంటలకు నిమ్స్ హాస్పిటల్‌లో 2వేల మందికి పండ్ల పంపిణీ, సాయంత్రం నాలుగు గంటలకు బసవ తారకం క్యాన్సర్ దవాఖాన నుంచి తెలంగాణ భవన్‌కు భారీ ర్యాలీ నిర్వహించాలని నిర్ణయించారు. తెలంగాణ భవన్‌లో జరిగే దీక్షా దివస్‌కు హైదరాబాద్‌లోని వివిధ నియోజకవర్గాల నుంచి 10వేల మంది వరకు హాజరు అవుతారని నేతలు ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఎమ్మెల్యేలు పద్మారావు గౌడ్, ముఠా గోపాల్, కాలేరు వెంకటేశ్, మాజీ చైర్మన్లు ఎర్రోళ్ల శ్రీనివాస్, విప్లవ్, నేతలు ఎంఎన్ శ్రీనివాస రావు, తలసాని సాయి కిరణ్, మన్నె గోవర్ధన్, కిశోర్ గౌడ్, ఆర్వీ మహేందర్, కార్పొరేటర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

శంషాబాద్ రూరల్ :కాంగ్రెస్ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకుపోవాల్సిన బాధ్యత బీఆర్ఎస్ కార్యకర్తలపై ఉందని ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి, మాజీ మంత్రి మహమూద్ అలీ పేర్కొన్నారు. మంగళవారం శంషాబాద్ పట్టణంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అధ్యక్షతన జిల్లాలో దీక్షా దివస్ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి, మాజీ మంత్రి మహమూద్ అలీ పాల్గొని మాట్లాడారు. ఈ నెల 29న ఉదయం 8 గంటలకు ఎవ్వరికి వారు వారి గ్రామాలు, వార్డులలో బీఆర్ఎస్ జెండాలను ఆవిష్కరించడంతో పాటు 10 గంటలకు శంషాబాద్‌లోని పార్టీ కార్యాలయానికి చేరుకోవాలని సూచించారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టు కాలనీలోని తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి అక్కడి నుంచి కార్యాలయంలో దీక్షా దివస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు అంజయ్యయాదవ్, జైపాల్‌యాదవ్, రాజేంద్రనగర్ ఇన్‌చార్జి కార్తీక్‌రెడ్డి, మాజీ గ్రంథాలయ చైర్మన్ వెంకటరమణారెడ్డి, మాజీ రైతు బంధు అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, తీగల విక్రంరెడ్డి, అనంతరెడ్డి, మాజీ జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ గణేశ్, సత్యనారాయణ, మాజీ ఎంపీపీ సయమ్మశ్రీనివాస్, డీసీసీబీ డైరెక్టర్ సతీశ్, శంషాబాద్ కౌన్సిలర్ భారతమ్మ, నాయకులు పాల్గొన్నారు.

తెలంగాణకు స్వాతంత్ర్యాన్ని తెచ్చింది కేసీఆరే..

దుండిగల్, నవంబర్ 26 : భారతదేశానికి స్వాతంత్ర్యం తెచ్చింది మహాత్మాగాంధీ అయితే తెలంగాణకు స్వాతంత్ర్యాన్ని తెచ్చింది మాత్రం కేసీఆర్ అని శాసనమండలి మాజీ చైర్మన్, దీక్షాదివస్ మేడ్చల్ జిల్లా ఇన్‌చార్జి స్వామిగౌడ్ అన్నారు. ఈ నెల 29న బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించనున్న 'దీక్షాదివస్' కార్యక్రమాన్ని పురస్కరించుకొని దుండిగల్ మున్సిపాలిటీ పరిధి గండిమైసమ్మలోని మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం దీక్షాదివస్ జిల్లా స్థాయి సన్నాహక సమావేశం జరిగింది. ఎమ్మెల్సీ, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు శంభీపూర్ రాజు అధ్యక్షతన జరిగిన సమావేశానికి స్వామిగౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై బీఆర్ఎస్ నేతలకు, శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు మల్లారెడ్డి, వివేకానంద్, కృష్ణారావు, బండారి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు రాగిడి లక్ష్మారెడ్డి, మేయర్లు, మున్సిపల్ చైర్మన్లు, కార్పొరేటర్లు,కౌన్సిలర్లు, మహిళా నేతలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న దీక్షాదివస్ మేడ్చల్ జిల్లా ఇన్‌చార్జి స్వామి గౌడ్, చిత్రంలో ఎమ్మెల్యేలు మల్లారెడ్డి, వివేకానంద్, కృష్ణారావు, బండారి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

బీసీల సంక్షేమానికి కృషి చేస్తాం

ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

మల్కాజిగిరి, నవంబర్ 26: బీసీల సంక్షేమానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. బోయిన్‌పల్లిలోని క్యాంప్ కార్యాలయంలో మంగళవారం భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా బీసీ కులాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం బీసీ కుల గణన విధి విధానాలను 2001వ సంవత్సరంలో జరిపిన జన గణనతో పాటు సుప్రీం కోర్టు మార్గదర్శకాలను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. బీసీల రిజర్వేషన్ యాభై శాతానికి మించరాదని గెజిట్లో ఉన్న అంశాన్ని గుర్తు చేస్తున్నామన్నారు. బీసీల పట్ల ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే 70 శాతం ఉన్న బీసీలకు 50 శాతం రిజర్వేషన్‌ను ఎందుకు పరిమితం చేశారని ప్రశ్నించారు. దీనిపై ప్రభుత్వం పునఃసమీక్షించి బీసీలకు న్యాయం చేయాలన్నారు. ప్రభుత్వాలు బీసీలను గుర్తించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నాయని, కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో కుల గణన నిర్వహించాలన్నారు. బీసీల చైతన్యమే లక్ష్యంగా కులాలకు అతీతంగా పోరాటం చేస్తామన్నారు. శాసన సభలో బీసీల గొంతుకను వినిపించడంతో పాటు కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘాల జాతీయ, రాష్ట్ర నాయకులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

ఆరాంఘర్- జూపార్క్ ఫ్లై ఓవర్ పనులను పరిశీలిస్తున్న అధికారులు

3న మరో ఫ్లై ఓవర్ ప్రారంభం

ఆరాంఘర్ - జూపార్క్ ఫ్లై ఓవర్‌ను ప్రారంభించేందుకు సన్నాహాలు

పనులను పరిశీలించిన కమిషనర్ ఇలంబర్తి

సిటీబ్యూరో, నవంబర్ 26 (నమస్తే తెలంగాణ): వ్యూహాత్మక రహదారుల అభివృద్ధి ప్రాజెక్టు (ఎస్.ఆర్.డి.పి) ఫలాలు ఒక్కొక్కటిగా అందుబాటులోకి వస్తున్నాయి. హైదరాబాద్ నగరాన్ని విశ్వనగరంగా తీర్చిదిద్దాలన్న సంకల్పంలో భాగంగా గత కేసీఆర్ ప్రభుత్వం సిగ్నల్ రహిత ప్రయాణమే లక్ష్యంగా రూ.5112.36కోట్ల అంచనా వ్యయంతో 47 ప్రాజెక్టులు చేపట్టింది. అందులో భాగంగా రూ. 629.30కోట్లతో చేపట్టిన ఆరాంఘర్ నుంచి జూపార్క్ వరకు ఆరు లేన్లతో 119 పిల్లర్లతో 4.08 కిలోమీటర్ల మేర చేపట్టిన భారీ ఫ్లై ఓవర్‌ను వచ్చే నెల 3న ప్రారంభించేందుకు జీహెచ్ఎంసీ సన్నాహాలు చేస్తున్నది. ఇందులో భాగంగానే మంగళవారం కమిషనర్ ఇలంబర్తి, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, వాటర్‌వర్క్స్ ఈడీ మయాంక్ మిట్టల్ ఇతర అధికారులతో కలిసి ఫ్లై ఓవర్ పనులను పరిశీలించారు. ఈ నెల 30 నాటికి సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. సర్వీస్ రోడ్డు నిర్మాణానికి మొత్తం 17 ఆస్తులను సేకరించాలని, ప్రస్తుతం పని జరిగేదుకు 5 ఆస్తులు సత్వరమే సేకరణ చేసిన పక్షంలో.. పనులు ప్రారంభించే అవకాశం ఉంటుందని సీఈ దేవానంద్ కమిషనర్‌కు వివరించారు. సమస్య పరిష్కారానికి జోనల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని, నష్ట పరిహారం చెల్లింపునకు సంబంధిత ప్రతిపాదనను త్వరగా పంపిస్తే వెంటనే మంజూరు చేస్తానని కమిషనర్ హామీ ఇచ్చారు. ఈ పర్యటనలో ఎస్ఈ దత్తుపంతు, జోనల్ కమిషనర్ వెంకన్న, డిప్యూటీ కమిషనర్లు రవికుమార్, అరుణ, ఈఈ, డీప్యూటీ ఈఈలు తదితరులు పాల్గొన్నారు.

మేయర్ వర్సెస్ ఎంఐఎం

అజాద్ చికెన్ మార్కెట్‌పై దూకుడు పెంచిన మేయర్

సీజ్ చేయకుండా ఒత్తిళ్లకు లొంగడంపై అధికారులపై ఫైర్

చట్టానికి ఎవరూ అతీతులు కాదు..

దుకాణదారులను రక్షించే వారు ఎవరైనా సరే సహించబోం

ఎంఐఎం నేతల తీరుపై ఘాటుగా స్పందించిన మేయర్ విజయలక్ష్మి

మేయర్ ఆదేశాలతో రెండు చికెన్ సెంటర్లు సీజ్, లీజు రద్దు

కొత్తగా ఓపెన్ టెండర్లు పిలిచేందుకు అధికారుల ఏర్పాట్లు

జీహెచ్ఎంసీలో చర్చనీయాంశమైన మేయర్ తనిఖీ వివాదం

బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోకపోవడం పట్ల విమర్శలు

మేయర్

వివాదానికి కారణమైన చికెన్ షాప్ ఇదే..

ఎమ్మెల్సీ బేగ్

సిటీబ్యూరో, నవంబర్ 26 (నమస్తే తెలంగాణ): ప్రజారోగ్యానికి తీవ్రమైన ముప్పును కలిగిస్తున్న వారిని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించబోమని, చట్టానికి ఎవరూ అతీతులు కాదని, సీజ్ చేసిన దుకాణదారులను రక్షించడం తగదని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి తనదైన శైలిలో విరుచుకుపడ్డారు. నిబంధనలు ఉల్లంఘించిన చికెన్ సెంటర్ నిర్వాహకులకు అండగా నిలబడి, అధికారులపై బెదిరింపులకు దిగిన ఎంఐఎం నేతల తీరుపై మేయర్ ఘాటుగా స్పందించారు. ప్రజారోగ్య పరిరక్షణలో ఎవరూ అడ్డు తగిలినా సహించబోనని తేల్చి చెప్పారు. ఆహార నాణ్యత ప్రమాణాలు వ్యాపారస్తులు పాటించాల్సిందేనని, ఆరోగ్య భద్రతకు ప్రతి ఒక్కరూ సహకరించాలని స్పష్టం చేశారు. గోషామహల్ నియోజకవర్గంలోని చాదర్‌ఘాట్‌లో జీహెచ్ఎంసీకి సంబంధించిన అజాద్(మోతి)మార్కెట్‌లో ఈ నెల 22న మేయర్ విజయలక్ష్మి ఆకస్మికంగా తనిఖీ చేసి, కలుషిత, అపరిశుభ్రమైన, నాణ్యత లేని నాన్‌వెజ్ విక్రయాలు జరుపుతున్న రెండు చికెన్ షాపులను తక్షణమే సీజ్ చేయాలని మేయర్ అధికారులను ఆదేశించారు. ఈ ఘటన జరిగిన కొద్ది సేపటికే మజ్లిస్ పార్టీ ఎమ్మెల్సీ బేగ్, కొందరు వార్డు మెంబర్లు అక్కడకు చేరుకుని జీహెచ్ఎంసీ అధికారులను బెదిరించారు. సీజ్ చేసి తీసుకువెళ్లిన చికెన్‌ను బలవంతంగా తీసుకొచ్చారు. తిరిగి 24 గంటల వ్యవధిలోనే షాపులను తెరిపించి యథేచ్ఛగా వ్యాపారం సాగేలా చేశారు. ఈ విషయంలో మేయర్ ఆదేశాలు డోంట్‌కేర్..ఇంట్లో ఎలుకలు ఉన్నాయని, ఇంటిని సీజ్ చేసుకుంటామా? అంటూ ఎమ్మెల్సీ బేగ్ మేయర్ తనిఖీల తీరును ఎండగట్టారు. ఈ అంశం జీహెచ్ఎంసీలో హాట్ టాపిక్‌గా మారడం, 'నమస్తే తెలంగాణ' మంగళవారం ప్రత్యేక కథనం ప్రచురించింది. ఈ కథనంపై స్పందించిన మేయర్, వెటర్నరీ విభాగం ముఖ్య అధికారి వకీల్, ఇతర అధికారులపై తీవ్ర స్థాయిలో మేయర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్టేట్ విభాగం అధికారులను సైతం మందలించారు. రంగంలోకి దిగిన అధికారులు మేయర్ ఆదేశాల ప్రకారం నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ఈ రెండు చికెన్ షాపులను సీజ్ చేయడమే కాదు... వాటి గడువు ముగిసినా కొనసాగుతున్న లీజును రద్దు చేసి తిరిగి టెండర్లు పిలవాలని అదనపు కమిషనర్ ఎస్టేట్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. మొత్తంగా మేయర్ వర్సెస్ ఎంఐఎం ఎమ్మెల్సీ బేగ్ మధ్య జరుగుతున్న పరిణామం ఎటువైపు దారితీస్తుందో వేచి చూడాల్సిందే.

ఒక్క పర్యటన..ఎన్నో లోపాలు..

ఒక్క పర్యటన.. ఎన్నో లోపాలు.. ఘనత వహించిన అధికారులు ఏం చేస్తున్నారు? వారి లోపాలు స్పష్టంగా వెలుగులోకి వచ్చిన వారిపై చర్యలు ఏవీ? ఇంతకు జీహెచ్ఎంసీ దుకాణాల లీజు గడువు ముగిసినా వ్యాపారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవడంలో ఎందుకు ఎస్టేట్ విభాగం విఫలమైంది? జీహెచ్ఎంసీ ఆదాయ రాబడిలో కీలకమైన అద్దెదారుల విషయంలో ముఖ్య అధికారులు ఏం చేస్తున్నారు అంటే మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, కమిషనర్ ఇలంబర్తి సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అంతేకాకుండా నాణ్యత ప్రమాణాలు పట్టించుకోకుండా, అపరిశుభ్రమైన వాతావరణంలో వ్యాపారం చేస్తున్న వారి పట్ల వెటర్నరీ, ఏఎంఓహెచ్‌ఓలు ఏం చేస్తున్నారు? మేయర్ తనిఖీ తర్వాత బాధ్యులైన అధికారులపై చర్యలు ఎందుకు తీసుకోలేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. దుకాణదారులపై చర్యలు తీసుకున్నట్లే బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలన్న డిమాండ్ వ్యక్తమవుతున్నది.

చట్టానికి ఎవరూ అతీతులు కాదు..

దుకాణదారులను రక్షించేవారికి మేయర్ విజయలక్ష్మి హెచ్చరిక చేశారు. ప్రజలు ఉపయోగిస్తున్న ఆహార పదార్థాల భద్రత, నాణ్యతను కాపాడే ఉద్దేశంతో రెగ్యులర్‌గా హోటల్స్, రెస్టారెంట్లను ఆకస్మికంగా తనిఖీలు చేస్తున్నట్లు మేయర్ విజయలక్ష్మి తెలిపారు. ఈ నెల 22న చాదర్‌ఘాట్‌లోని అజాద్ మార్కెట్‌లో తాను అకస్మికంగా తనిఖీలు చేపట్టగా, రెండు డ్రెస్డ్ చికెన్ షాపులు అత్యంత అపరిశుభ్రమైన వాతావరణంలో నిర్వహణ ఉందని, అక్కడ ఎలుకలు తిరుగుతున్నాయని గమనించామని మేయర్ వివరించారు. వెంటనే జీహెచ్ఎంసీ అధికారులకు అట్టి షాపులను మూసివేయాలని ఆదేశించినట్లు తెలిపారు. ప్రజారోగ్య పరిరక్షణ జీహెచ్ఎంసీ ప్రాథమిక బాధ్యత అని, అజాద్ మార్కెట్‌లో ఉన్న అనారోగ్యకర పరిస్థితులు ఎలుకలు తిరుగుతూ ఉండటం, దుర్వాసన వెదజల్లడం, శుభ్రత లేకపోవడం వంటి ప్రజా ఆరోగ్యానికి తీవ్రమైన ముప్పును కలిగిస్తున్న దృష్ట్యా ఇలాంటి చర్యలు తీసుకోవడం అత్యవసరమైందని మేయర్ తెలిపారు. జీహెచ్ఎంసీలోని అన్ని వ్యాపార స్థావరాలు, షాపుల యాజమానులు శుభ్రత, ఆహార నాణ్యత ప్రమాణాలు పాటించాలని, ఆరోగ్య భద్రతకు సహకరించాలని మేయర్ కోరారు. ప్రజల ఆరోగ్యం కోసం జీహెచ్ఎంసీ ఎల్లప్పుడు కట్టుబడి ఉంటుందని మేయర్ పేర్కొన్నారు. చట్టానికి ఎవరూ అతీతులు కాదని, సీజ్ చేసిన దుకాణదారులను రక్షించడం తగదని ఈ సందర్భంగా ఎంఐఎం నేతలకు మేయర్ హెచ్చరించడం గమనార్హం.

ఈ రెండు షాపులు సీజ్, లీజు రద్దు..

గతంలోనూ ఈ షాపుల యాజమానులకు పబ్లిక్ హెల్త్ నార్మ్స్ ఉల్లంఘించినందుకు నోటీసులు జారీ చేశారని, జీహెచ్ఎంసీ చట్టం 1955 సెక్షన్ 521, 622, 487, 596 కింద షాపులు ఖాళీ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు షాపుల యాజమానులు ఆ నోటీసులు స్వీకరించకుండా తిరస్కరించడంతో వాటిని గోడపై అతికించడంతో పాటు రిజిస్టర్డ్ పోస్ట్ ద్వారా పంపించామని ఖైరతాబాద్ జోన్ డిప్యూటీ డైరెక్టర్ తెలిపారు. అంతేకాకుండా అజాద్(మోతి) మార్కెట్ లీజుల గడువు ముగిసిందని, తిరిగి ఆన్‌లైన్‌లో టెండర్ల ద్వారా ఈ రెండు షాపులను తిరిగి అద్దెకు ఇవ్వాలని నిర్ణయించడం గమనార్హం.

అసలేం జరిగిందంటే.?

సర్కిల్-14 డిప్యూటీ కమిషనర్, అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్ హెల్త్, వెటర్నరీ డిప్యూటీ డైరెక్టర్ అసిస్టెంట్ డైరెక్టర్, వెటర్నరీ ఆఫీసర్ అధికారుల బృందం రషీద్ హుస్సేన్ (స్టాల్ నం.3), కలీమ్ హుస్సేన్‌లు (స్టాల్ నం.42) నిర్వహిస్తున్న చికెన్ షాపులపై గత శుక్రవారం తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీలో 1600 కంటే ఎక్కువ బ్రాయిలర్ కోళ్లు, 30 కిలోల డ్రెస్డ్ చికెన్, 7 కిలోల లివర్‌ను కనుగొన్నారు. ప్రజా ఆరోగ్య భద్రత దృష్ట్యా వెటర్నరీ విభాగం సంబంధిత చికెన్, లివర్‌ను స్వాధీనం చేసుకొని.. బ్రాయిలర్ పక్షుల(కోళ్లు)ను రెండు గంటల లోపు తీసుకువెళ్లాలని ఆయా షాపుల నిర్వాహకులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ ఘటన జరిగిన కొంత సమయం తర్వాత మజ్లిస్ పార్టీ ఎమ్మెల్సీ బేగ్, కొందరు వార్డు మెంబర్లు అక్కడకు చేరుకుని జీహెచ్ఎంసీ అధికారులను బెదిరించారు. సీజ్ చేసి తీసుకువెళ్లిన చికెన్‌ను బలవంతంగా తీసుకువెళ్లారు. ఈ ఘటనపై గోషామహల్ సర్కిల్ వెటర్నరీ ఆఫీసర్ కాచిగూడ పోలీసులకు ఫిర్యాదు చేశారు.